

# మేష్టారూ! మీరు జవాబు చెప్పలేదు!!

— ఝరి

"విశాల ఐదు సంవత్సరాల క్రితం లేచిపోయింది" – అన్న నిజం తెలిసిన మరుక్షణం నిరంజనానికి గుండె ఆగినంత పనైంది. విశాఖపట్టణం నుంచి తిరిగొచ్చి నెల రోజులైనా క్రితం ఆలోచనలు మాత్రం విశాలచుట్టూ తిరుగుతున్నాయి. తన్ని తల్చుకొన్న ప్రతిక్షణం కళ్ళు చెమర్చేవి. ఆమె చేసిన పనికి తనెంతవరకు బాధ్యుడు? అన్న అనుమానం అతనికి రాకపోలేదు.

కావ్యాల్లో, సినిమాల్లో వుండే సద్గుణ సంపన్నుడు ధీరోదాత్త కథానాయకుడు కాడు నిరంజనం. అతను సాధించాల్సినవి, పొందాల్సినవి చాలా మట్టుకు డబ్బుతో, చదువుతో సాధించేడు. మంచి హోదా; నల్లటి కారుతోపాటు అందమైన భార్య – ముగింపు లేదనుకొన్న వాళ్ళిద్దరి వెన్నెలరాత్రుల కథకి ముగింపుగా ఇద్దరు పిల్లలు.

జీవితాన్ని తేలిగ్గా తీసుకునే మన

స్త్రీత్వం కాదు నిరంజనానిది. పెద్దల అనుభవాలతో మలచిన బాటలో నడుచుకోవడం మంచిదని అతని నమ్మకం. అతను పదిలంగా దాచుకొన్న తియ్యటి జ్ఞాపకాల మాటున విశాల చేదు ప్రశ్న గుర్తుకొచ్చినప్పుడు తల్లడిల్లిపోయేవాడు.

చదువు ముగిసి బాధ్యతలు నెత్తిమీద పడటంతో విశాలను గురించి అంతగా పట్టించుకోలేకపోయేడు విశాఖపట్టణం వొదిలేసిన కొత్తల్లో ఎన్నో ఉత్తరాలు రాసేడు. ఎన్ని రాసినా విశాల దగ్గిర నుంచి జవాబు రాకపోవడానికి కారణాలు అప్పట్లో తెలీలేదు నిరంజనానికి.

ఆమెలో తెగింపు నిరంజనం ఎన్నడూ వూహించలేదు.

ఆ రోజు సాయంత్రం....

నిరంజనం కారు మెయిన్ రోడ్డు ఎక్కింది.

అతని ఆలోచనల్ని విశాల చుట్టుముట్టింది. ఆమె ప్రశ్న పువ్వుమీద తుమ్మెదలా అతన్ని దొలిచెయ్యని క్షణం లేదు. ఆమె ఎందుకు లేచిపోయింది? అన్న అనుమానంతో సతమతమౌతున్న సమయంలో ఆలోచనల్కి - కారుకి సడన్ బ్రేక్ పడింది. 'సర్రు' మంటూ కారు ఆగింది. క్షణం బ్రేక్ వెయ్యటం ఆలశ్యమైతే ఆ రోడ్డుమీద నల్ల అంబాసిడర్ కారుకింద ఓ అదప్రాణి చరిత్ర అంతటితో ముగిసేది.

"డర్టీ క్రీచర్స్....!" అని వినుకోక తప్పలేదు నిరంజనానికి.

కళ్ళద్దాలోంచి కళ్ళు పెద్దవిచేసి తన కారుకి అడ్డంపడ్డ రోడ్డుమీద పాకుతున్న వికృతంగా వున్న పురుగువైపు అసహ్యంగా చూసేడు.

అన్నంలేని పొట్ట వెన్నెముకలోకి తంతోంది. చిరిగిన జాకెట్టులోంచి బయట పడ్డ స్తనాలు వాటిమీదున్న మాయని మచ్చలు, గోళ్ళ ఆనమాలు అనుభవించిన రసికుల సంఖ్య చెప్పకపోయినా-సినిమా వాల్ పోస్టర్లో అర్ధనగ్న శృంగార కథానాయికివి మాత్రం గుర్తుకి తేవటం లేదు ఆమె వొంటిమీద చర్మంకన్నా చమటతో తడిసిన మట్టి బాగాకన్పిస్తోంది. తైలసంస్కారం ఎరగని జుట్టు పీకేసిన మామిడి టెంకెలా వుంది. కళ్ళనుంచి కారుతున్న కన్నీరు అనుభవిస్తున్న బాధను స్పష్టంగా చెప్తున్నాయి. వొంటిమీద చిరుగు చీర వుందో లేదో అర్థం కావటంలేదు. నడకకి వుపయోగం లేని కాళ్ళు, వాటిమీద వాల్తున్న ఈగల్ని నిరంజనం కళ్ళద్దాలు చూడలేకపోయేయి.

నిరంజనం శరీరంలో అలుపులేని రక్తం ఒక్కసారి ఆగిపోయి విశ్రాంతి తీసుకొంది. భూమి బద్దలై తనూ, తన కారు అట్టడుగుకి చొచ్చుకుపోయినట్లయింది. ప్రపంచం అంతా కూలిపోయి తనొక్కడే శిధిలమైన భవనాల మధ్య - శ్మశానంలో సగంకాలిన శవంకోసం

దిక్కుచిక్కున కుక్కలా తిరుగుతున్నట్లనిపించింది.

వెనక ఆగివున్న కారుహారన్ల శబ్దం చెవిని తాకలేదు. తుఫానులో సముద్రపు అల్లకల్లోలానికి తట్టుకోలేని ఒంటరి నావలా అతని మనస్సు స్థిరంలేకుండా వుంది. స్టీరింగుమీద చేతులు వణికేయి. కర్తవ్యం అర్థంకాకముందే కారు మలుపు తీసుకొని ఆలోచనలకన్నా వేగంగా ఇల్లు చేరుకొంది

* * *

వేసుకొన్న సూటు విప్పలేదు. చలనం లేకుండా వాలుకుర్చీలో కూలిపోయిన చెట్టులా పడున్నాడు నిరంజనం. వికలమైన మనస్సు తన అసమర్థతను వెక్కిరించినట్లయింది

విశాల.... విశాల...

ప్రతి క్షణం విశాల కళ్ళల్లో మెదులుతోంది. తన ఆరాటానికి ఆజ్యం పోస్తోంది.

.... అద్దూ, అదుపులేని ఏరులా గలగలా నవ్వింది.

"మీరు జవాబు చెప్పలేదు....!" - విశాలగొంతు ఇల్లంతా ప్రతిధ్వనించింది.

"అవును. జవాబు...." అస్పష్టంగా గొణుగుతున్నాడు నిరంజనం.

గతించిన గతానికి మళ్ళీ రంగులు పూస్తున్నాడు నిరంజనం.


* * *

అడుక్కునే వాళ్ళకి డబ్బు దొరికితే అదృష్టం అనుకొంటారు. కాలేజీ కుర్రాడికి అందమైన ఆడపిల్ల కౌగిలిదొరకడం అదృష్టం అనుకొంటాడు. ప్రపంచాన్ని చూడని పసిబిడ్డకు తల్లి పొదుగు దొరకడం అదృష్టమైతే నిరంజనానికి విశాల వుంటున్న ఇంట్లో రూము దొరకడం అదృష్టం అని అతను అనుకోకపోయినా చాలా మంది స్నేహితు లనుకొన్నారు.

విశాల వోణీల్లో రంగుల సీతాకోక చిలుకలా వుండేది. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ వుండేది. విశాల యవ్వనంలో కాలుపెట్టిన రోజునుంచి - వాళ్ళింటి ముందున్న కిళ్ళీకొట్టుకి గిరాకీ బాగా పెరిగింది. చాలామంది కుర్రకారుకి విశాల కనిపిస్తేగాని నిద్రపట్టేది కాదు.

ఇంట్లో చేరిన కొత్తలోనే మంచి పేరు కొట్టేసేడు నిరంజనం. దాంతో ఎప్పుడైనా విశాలతో మాట్లాడినా ఎండిన పుల్లలా వుండే వాళ్ళ అమ్మగారు కాని ఏడుకట్ల సవారీకోసం ఎదురుచూసే ఆ అమ్మాయి నాన్నగారు కాని పట్టించుకునేవారు కాదు.

విశాలతో స్నేహం పెరిగిన కొద్దీ వూర్లో పుకార్లు బాగా వ్యాపించేయి. అవేవీ వాళ్ళ మధ్య స్నేహానికి అడ్డుగోడల్లా నిలవలేదు. తను సాయంత్రం కాలేజీ నుంచి వచ్చేసరికి ఎన్నో కబుర్లు చెప్తుండేది. ఎప్పుడూ పుస్తకాలు, పత్రికలు చదువుతుండేది. ఎన్నో సందేహాలు



తన్నడిగి వివృత్తి చేసుకునేది. చదివిన వాటి మీద విమర్శలు చేస్తుండేది.

ఆమెతో వున్నంతసేపూ కాలం తెలిసేదికాదు. ఎంతో ఆనందంగా హుషారుగా సంవత్సరాలు గడిచిపోయేయి.

ఫైనల్ ఇయర్ పరీక్షలు సరిగ్గా నెలరోజుల్లో పడ్డాయి. విరంజనం పూర్తిగా పుస్తకాల్లో మునిగిపోయేడు. విశాల రూముకి రావడం తగ్గించింది.

ఆ రోజు....

ఊరు చీకటిని పులుముకుంది.

విరంజనం డాబామీద భవిష్యత్తు బంగారు బాటకి పునాదులు వేస్తున్నాడు. ఆకాశంలో చంద్రుడి కాంతి ఇంకా శరీరాన్ని తాకటం లేదు. పరీక్షలనేవి లేకపోతే బాగుండుననిపించింది. తనుగనుక విద్యాశాఖ మంత్రి అయ్యుంటే పరీక్షలు అచ్చితంగా రద్దుచేసేవాడే - కాలేదు కాబట్టి వొంటరిగా రిటైరయిన డాబామీద పొడవని చుక్కలకోసం చూస్తూ కూర్చున్నాడు.

"మాస్టారూ...."విశాలస్వరం చెవిలో దూరేసరికి వేస్తున్న పునాదుల్ని ఆపి "ఏమిటి"అన్నట్లు తలపంకించి మసక చీకట్లో మెరుస్తున్న విశాల కళ్ళల్లోకి చూసేడు,

"ఏమిటి? అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు?!" - గాలి అలలతో పాటు వీణమీటినట్లు విశాల స్వరం.

"ఏం లేదు రాబోయే పరీక్షల గురించి!"

"వాటి గురించి తాపీగా తల బద్దలు కొట్టుకోవాల్సిన అవసరం లేదనుకొంటాను."

నిరంజనం నవ్వుని మొహానికి పులుముకున్నాడు.

"మేష్టారూ! నేను చాలా రోజుల నుంచి మిమ్మల్నో ప్రశ్న అడగాలను కొంటున్నాను. ప్రశ్న అంటే నా ఉద్దేశ్యంలో ఓ పెద్ద సందేహం. మీ అభిప్రాయం అంటే జవాబు కావాలి!!"

నిరంజనం నిజంగా ఖంగారుపడ్డాడు. అంత సీరియస్‌గా ఎప్పుడూ విశాల ఏదీ అడగలేదు; అందులోనూ ప్రశ్న. తన మనసులో తను అడగబోయే ప్రశ్న అనుమానంతో కూడిన భయం చోటుచేసికొంది. కొన్ని క్షణాలు వాళ్ళిద్దరి మధ్యా గాలిహోరు, క్రింద ఇంట్లో రేడియో పాటల శబ్దం చోటు చేసుకొన్నాయి.

"ఊఁ .... అడుగు...." మధ్యనున్న మూగగాలిని చీలిస్తూ నిరంజనం.

"అదే ఏది చెప్పాలో అర్థంకావటం లేదు."

"ఏం? అంత అర్థంకాని ప్రశ్నా?!!"

"లేదు మీరు బాగా ఆలోచించి జవాబు ఇవ్వాల్సిన ప్రశ్న."

"సస్పెన్సుతో చంపకు విశాలా.... తొందరగా చెప్పు."-నిరంజనం ఆతృత.

మళ్ళీ ఇద్దరిమధ్య సంభాషణ్ని దూరంచేస్తూ వెళ్తోంది వేపచెట్టు గాలి. విశాల చేతిగాజులు గలగల మన్నాయి. నిరంజనం వెయ్యబోయే ప్రశ్న నోటితో వూహిస్తున్నాడు. తన ప్రయత్నం చెదలుతిన్న పుస్తకం చదివినట్లయింది.

కొన్ని క్షణాల మౌనాన్ని ఛేదించింది విశాల.

"నా వుద్దేశ్యంలో స్త్రీకి పెళ్ళి అనేది అనవసరం అంటాను. పెళ్ళి అనే యజ్ఞానికి ఆడది బలిపశువు కాదా? ఎవరో ముక్కూ - మొహం తెలీని వ్యక్తితో జీవితాంతం — అవసరమైతే మన ఆనందాల్ని, కోరికల్ని చంపుకొని ఈ సంఘం కట్టుబాట్లకి తలవంచి ఓ పరిధిలో బ్రతకాల్సిన అగత్యం ఏమిటి? పెళ్ళి అనేది మనలో నిగూఢంగా వున్న కోరికల్ని తీర్చుకోడానికేగా!! అలాంటప్పుడు నన్ను మెచ్చే మగాడితో ఈ బంధం లేకుండా వుండామని వుంది. ఒకవేళ నేను మెచ్చినవాడు నన్నూ, నా నమ్మకాల్ని అసహ్యించుకొన్ననాడు నన్ను మెచ్చే మరొకడితో హాయిగా వుంటాను.... నిజానికి ఇది నా ప్రశ్న - సందేహం కాదు. చాలామంది స్త్రీల మనసుల్లో బయటపడని మథన అని నా

నమ్మకం. చెప్పండి! అలా చెయ్యడంలో తప్పేమిటి!"–

ఆమె చెప్పిందాంట్లో ఏది ప్రశ్నో అర్థంకాని విరంజనానికి పూర్తిగా మతి పోయిందని అతని ముఖకవళికల్ని బట్టి చెప్పొచ్చు. ఆకాశంలో మబ్బులు–చంద్రుణ్ని, విరంజనం మొఖాన్ని విశాలకు కనబడకుండా తెరల్లా అడ్డు నిలబడ్డాయి. "ఇంత చిన్న వయస్సులో పెద్ద అనుమానం రావడం దురదృష్టం" అన్పించింది విరంజనానికి.

"ఇది విశాల సందేహం కాదు. ఆమె చదివిన పుస్తకాల్లో మధ్యతరగతి కథానాయకులు అడిగించిన ప్రశ్న"– అని అనుకొన్న విరంజనం ఇంకా వాస్తవంలోకి రాలేదు.

"ఏం మాష్టారు .... మరి జవాబు చెప్పండి!" – కోలుకోని విరంజనంకి పరీక్షల సంగతి కాని, విశాల మాటలు కాని వినబడటం లేదు

"విశాలా! నీ అభిప్రాయాలు కేవలం పుస్తకాల్లో– కథల్లో రచయితలు సృష్టించుకొన్నవి మాత్రమే .... కానీ ఇది జీవితం .... ప్రతి మనిషిలోనూ స్వార్థం వుంటుంది తమకి దొరికిన వస్తువును వుపయోగించుకొంటారు. అవసరం తీరేక విసిరెయ్యడం పరిపాటి. అందులో ఆడది.... తమ కొద్ది క్షణాల వెర్రి ఆవేశానికి ఏ పనైనా చేసి తమ కార్యం పూర్తవగానే పెళ్ళాన్నే చిన్న చూపు చూసే ఈ మనుషుల్లో నిన్నర్థం చేసుకునే మొగవాడు వుంటాడంటే నే నమ్మను... నీ పిచ్చి పిచ్చి ఆలోచనలు మానేయ్" – అని చెప్దామనుకొన్నాడు విరంజనం.

అప్పటికే విశాల పాదరసంలా మేడమీదనుంచి వాళ్ళమ్మ పిలిచిన పిలుపుకి జారిపోయింది.

విరంజనానికి రోడ్డుమీద లైట్లుకాని, రేడియో మోతలు కాని వినబడ్డంలేదు. ఇంకో ఐదు శతాబ్దాల తర్వాత అడగవలసిన ప్రశ్న.... అందులో విశాల అడగటం ....

చీకట్లో, గాల్లో తేల్తూ విరిగిపడబోతున్న కెరటంలా విశాల మళ్ళీ లీలగా కళ్ళల్లో మెదిలి నవ్వుతూ 'జవాబు' కావాలంది. ఆ క్షణంలో విరంజనంలో టెంపరేచర్ని ఏ థర్మామీటరు కొలవలేదు.

మళ్ళీ విశాల మేడమీదకి రాలేదు. ఆ రాత్రి గండం గడచినట్లయింది విరంజనానికి.

* * *

పరీక్షరోజులు కావటంవల్ల చికాగ్గా జరుగుతున్నాయి రోజులు. అతని ప్రతి ఆలోచనలోను విశాలను గురించిన ఆవేదన వుంది. తర్వాత చాలాసార్లు జవాబుకోసం వేధించింది విశాల. సమాధానం చెబ్దామనిపించినా ఎలాచేస్తే

అర్థమౌతుందో ఆలోచించేసరికి తన చదువు పూర్తయింది.

విశాఖపట్టణం వొదిలే ఆఖరి రోజున విశాల కళ్ళల్లో నీటి మెరుపుల్ని, ఆమె బుగ్గలమీద అవిచేసిన మరకల్ని అతను మర్చిపోలేకపోయేడు.

"మాస్టారూ ... తప్పించుకొన్నారు. సమాధానం చెప్పలేదు" — అని ఆఖరుసారి రైలు కదిలే ముందు రెట్టించింది విశాల. నిరంజనం కనుబొమలు ముడి పడ్డాయి. రైలు వేగాన్ని పుంజుకొని నిరంజనం ఉజ్వల భవిష్యత్తులోకి దూసుకుపోయింది.

"నీ ప్రశ్నకు నీ జీవితమే సమాధానం అవుతుంది...." అని నిరంజనం చెబ్దామనుకోలేదు.

* * *

తను చూపింది 'అబద్ధం' అని తనలో ఆరని చేతికి నీళ్ళు చల్లలేకపోయేడు నిరంజనం.

....రోడ్డుమీద ఊహించలేనంత దారుణంగా చిన్నపిల్లవాడు వేసిన అర్థం లేని బొమ్మలా.... చీకిపోయిన బట్టల్తో చితికిన బ్రతుకుతో.... విశాల.

చావుకన్నా భయంకరమైన ఈస్థితితో ....ఇలా జీవితంలో బ్రతికుండగా చూడాల్సొస్తుందని కలలోకూడా తలవని.... తను చూసిన నిజం...ఈదశ రాకుండానే విశాలను చావు వరించి వుంటే ??? — నిరంజనం ఆలోచనల్లకి అంతిమ క్షణాలు.


నిరంజనం శరీరంలో జీవం వున్న ప్రతిక్షణం స్నేహం విలువ గుర్తించమన్నాయి. ఆమెను అప్పుడే అనుభవాల తప్పుదార్లోంచి మళ్ళించివుంటే ఈ రోజు అంత హీనమైన, అసహ్యమైన స్థితిలో విశాలను చూసేవాడా ??? — నిరంజనం నరాలు స్పందించేయి.

"జీవితంలో పెళ్ళాం, బిడ్డలు — ఏడుపులు, డబ్బు, హోదా కాదు: దాని సార్థకత మాసిపోని మంచి పని చేసినప్పుడే" — అని నిరంజనానికి ఆ రాత్రి ఎవ్వరూ చెప్పలేదు.

ఆ రాత్రి అతని మానసిక సంఘర్షణకి వెలుగుబాట కల్పించింది. మరో ఆలోచనకి తావివ్వకుండా విసురుగా బయటకొచ్చేడు.

అప్పటికే సూర్యుడు నగ్నంగా ఆకాశంలోకి వచ్చేడు. చేతికున్న గడియారం ఏడు గంటలు చూపించింది. కారు వేగంగా పోర్టికోలోంచి బయట పడింది. తను తీసుకొన్న నిర్ణయానికి మనసు తేలికపడ్డా — కళ్ళు ఆతృతగా విశాలకోసం వెదకసాగేయి. మెయిన్ రోడ్డు దాటి బ్రిడ్జిమీద కొచ్చేసరికి పుట్‌పాత్‌మీద జాలిలేని జనం గుమిగూడి వున్నారు. నిరంజనం రక్తం వేగాన్ని పుంజుకుంది. వంటికి పట్టిన చెమట్లు చొక్కాను తడిపేసేయి. కారు పార్కు చేసి జనంవైపు పరిగెట్టేడు.

అక్కడ.... క్రితం రాత్రే.... తిండి




లేక రోగాలతో కుళ్ళిపోయి దుమ్ముతో దుప్పటి కప్పుకొని, ఈ మనుష్యుల జాలి, దయ కరుణకు నోచుకోలేని ఈ సింథటిక్ లోకంనుంచి ఎవ్వరూ అందుకోలేని చోటుకి చేరుకొంది.

ఆ శవంచుట్టూ చిల్లర చిందరవందరగా పడుంది. కుళ్ళిన అరిటిపండుకి గుచ్చిన అగరువొత్తుల నుంచి వస్తున్న పొగ గాల్లో ఘనీభవిస్తోంది.

"బాబూ! దిక్కులేని అడముడిసి.... సచ్చిపోయింది .... దర్మ పెబువులు ధర్మం సెయ్యండి బాబులూ...." స్వంత వాళ్ళు పోయినంత హడావిడి చేస్తున్నారు వున్న ముగ్గురు ముష్టివాళ్ళు. పడుతున్న చిల్లరకాసుల్ని చూసి మనసు సంతోషంతో పరవళ్ళు తొక్కుతున్నా జనం కోసం కన్నీళ్ళు కార్చటం తప్పటం లేదు పాపం వాళ్ళకు!

ఆమె యవ్వనపు పెదాల తీపి రుచి చూసి-ఎన్నో చీకటి రాత్రుల్లో కనబడని ఆమె కౌగిళ్లో కరిగిపోయిన పెద్ద మనుష్యుల హృదయాల్ని ఆమె చావు కదిలించలేదు ఎన్నో సార్లు చాలా రాత్రుళ్ళు బ్రాందీ సీసాల్లో స్నానం ఆడింది చాలాసార్లు - చాలామంది కోర్కెలకి చీరలు మార్చింది. చావుకి తెగింపులేని మనసుతో క్షణక్షణం నరకం అనుభవించింది.

తను నమ్మిన దారి సరైనది కాదని తన ప్రశ్నకు తనే జవాబు అని తెలుసుకునే ఈ ప్రపంచం నుంచి వెళ్ళిపోయింటుంది.

"మంచి నిర్ణయాలెప్పుడూ ఆలస్యంగా జరుగుతాయని" తెలీని నిరంజనం మంచు శిల్పంలా విశాల కార్చిన కన్నీళ్ళలో కరుగుతున్నాడు.

---